ఈ వారం కథ

# వల

## - కుప్పిలి పద్మ



పదహారేళ్ళ వయస్సు -
ఫ్రెష్ అడాల్‌సెంట్ ఏజ్.
ఆలోచనలు - వూహలు
కలలు అన్నింటా స్వచ్ఛత
కోయిల కూసినా -
సంధ్యవాలినా-
మెరుపు మెరిసినా -
అబ్బాయి కన్నుకొట్టినా
అంతా ఉద్వేగమే.



7-1-94 ఆంధ్రజ్యోతి వారపత్రిక

వేసవి మధ్యాహ్నం. గాలి లేదు. ఏ గదిలో నడుం వాలుద్దామన్నా వుక్క. క్రాంప్టన్‌గ్రీవ్స్ - ర్యాలి - ఖేతాన్ పంకాలన్నీ నిర్జీవంగా చూస్తున్నాయి. పవర్‌కట్.

చదువుకుందామంటే వళ్ళంతా చెమట. చదవాలనిపించదు. అయినా పేపర్ తీశాను. హెడ్డింగ్స్ చూస్తూ పేజీలు తిప్పతోంటే ఓ చోట అంకితంగా చూపులు అతుక్కుపోయాయి.

బోల్డన్ని ఫోటోలు. అందులో ఓ ఫోటో చూస్తుంటే జ్ఞాపకాల దొంతర్లోంచి గుసగుస. ఫోటోగ్రాఫర్ పేరు కోసం చూశాను. కె.ఎస్. - అని వుంది. ఊరు పేరు లేదు.

తిరిగి ఫోటో వేపు చూశాను. ఊపిరి ఆగింది. కళ్ళ అందాలని సజీవంగా పట్టుకునే నేర్పు ఎవరికుంది? ఎన్నో జ్ఞాపకాలు. కొన్ని నవ్వులు. కొంచెం కన్నీళ్ళు.

ఇంకెవరూ?

సురేష్!

అవి పదవతరగతి పాసై కాలేజి చదువులకి వెళ్ళిన తొలి దినాలు. పదహారేళ్ళ వయస్సు - ఫ్రెష్ అడాల్‌సెంట్ ఏజ్. ఆలోచనలు - వూహలు - కలలు అన్నింటా స్వచ్ఛతే. కోయిల కూసినా - సంధ్య వాలినా - మెరుపు మెరిసినా - అబ్బాయి కన్ను కొట్టినా అంతా ఉద్వేగమే.

ప్రతీది నూతనంగా - సజీవంగా - శాశ్వతంగా తోచే వయస్సు.

ఇదిగో సరిగ్గా అటువంటి లేత మనసులో మెరుపల్లే మెరిసాడు సురేష్.

ఒకానొక నవంబరు నెలలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కాకినాడ లైబ్రరిలో ఇంటర్ కాలేజి విద్యార్థినీ విద్యార్థులకి వ్యాసరచన - వక్తృత్వపు పోటీలు జరుగుతోంటే కందుకూరి రాజ్యలక్ష్మి కాలేజి తరపున వ్యాస రచన పోటీకి నేను - ఐ.టి. కాలేజ్ నుండి వక్తృత్వపు పోటీకి సురేష్ కాకినాడ వెళ్ళాం.

తోటలోకి వెళ్ళాను
అప్పటికే సురేష్ వచ్చి
ఎదురు చూస్తున్నాడు.
ఫోటోస్ చేతిలో పెట్టాడు.
'ఇవి నావేనా?
నాలో ఇంత మెరు
వుందా?'
నాలో నేనే తబ్బిబ్బై
పోతుంటే బుగ్గపై ముద్దు
పెట్టాడు.



ఇచ్చిన టాపిక్‌పై అనర్గళంగా మాట్లాడేస్తున్న సురేష్‌ని చూస్తుంటే భలే ఆశ్చర్యంగా అనిపించింది. అతనికి మొదటి బహుమతి వచ్చింది. వ్యాస రచనలో నాకు ప్రథమ బహుమతి వచ్చినా పెద్దగా సంతోషమనిపించలేదు. నేనేం రాసానో నాకు, ఆ జడ్జిలకి మాత్రమే తెలుసు. కాని వక్తృత్వ పోటీలో పాల్గొంటే ఓ విషయం పట్ల నా ఆలోచన - అవగాహనా నలుగురితో చెప్తున్నట్టుంటుంది. సరియైనవా కావా తెలుస్తాయ్. సురేష్‌లా మాట్లాడగలిగితే? నేనలా మాట్లాడగలనా?

"విషయం మీద అవగాహన వున్నా ఎందుకని వక్తృత్వంలో పాల్గోవు?" అడిగాడొకరోజు సురేష్.

"బహుశా నే పెరిగిన వాతావరణం అనుకొంటా"

"అంటే" అయోమయంగా అడిగాడు సురేష్.

"ఆడపిల్లలు గట్టిగా మాట్లాడకూడదు, పెద్దగా నవ్వకూడదు, తలెత్తి నడవకూడదు అనే సంస్కృతి మా ఇంట్లో వుంది. నా బాల్యమంతా అతి ఒద్దిగ్గా గడిచిపోయింది. ఇప్పుడిప్పుడే ఇంట్లోవాళ్ళకి ఇష్టం లేకపోయినా తిట్లు చివాట్లు తింటూనో, ఒప్పించో ఇలా పోటీలంటూ బయటకి రాగలుగుతున్నాను. అయినా అంతర్లీనంగా ఇంటివాళ్ల భావాల ప్రభావం నాపై వున్నట్టుంది. అందుకేనేమో గట్టిగా మాట్లాడినా, నవ్వినా వులిక్కిపడతాను" ఆలోచిస్తూ చెప్పాను.

"ఛ. ఛా. అవన్నీ చెత్త భావాలు. హాయిగా నిర్భయంగా నవ్వుతూ మాట్లాడవోయ్. ఎంతసేపు నవ్వగలవో నవ్వు. చూస్తాను" చిర్నవ్వుతో అన్నాడు సురేష్.

అలా అలా భావాలని - అభిప్రాయాలని స్పష్టంగా వ్యక్తపరచగలిగే స్థితికి సురేష్ సాంగత్యంతో చేరుకొన్నాను.

సురేష్‌కి ఫోటోగ్రఫీపై చక్కని అవగాహన వుంది.

ఓ రోజు నా ఫోటోలు తీస్తానని అడిగాడు.

"నావా? ఎందుకు?" అడిగాను.

"ఆల్బమ్‌లో పెట్టుకోవచ్చు. పెళ్ళికొడుక్కి చూపించడానికి కూడా పనికొస్తాయనుకో" అల్లరిగా అన్నాడు.

"ఫో. నేనేం పెళ్ళికొడుకులకి ఇవ్వను" అన్నాను.

సురేష్ నవ్వి "నాకే కావాలి ఫోటోస్" అంటూ గులాబీల ఉద్యానవనంలో ఆరేడు తీశాడు.

ఓ వారం రోజుల తర్వాత కాలేజ్‌కి వెళుతోంటే కనిపించి "సాయంత్రం తోట్లోకి రా" అని చెప్పాడు.


తోటలోకి వెళ్ళాను.

అప్పటికే సురేష్ వచ్చి ఎదురుచూస్తున్నాడు.

ఫోటోస్ చేతిలో పెట్టాడు.

'ఇవి నావేనా? నాలో ఇంత మెరువుందా' నాలో నేనే తబ్బిబ్బైపోతోంటే బుగ్గపై ముద్దుపెట్టాడు.

## వేణువే అంత



అనాది అరణ్యాల్లోంచో అగాధలోయల్లోంచో
రోదసీ తీరాల నుంచో
ఎక్కణ్ణుంచి వచ్చిందో ఈ వేణువు
నన్ను
వేదనారంధ్రాలు చేసి ఊదుతుంది
మంద్రమంద్రంగా గుసగుసగా బరువు బరువుగా
అలలు అలలుగా అనుభూతుల్ని రంగరిస్తుంది
ఈ రాత్రి మాల్కోస్‌లో విషాదించే వేళ
అంతరంగం నల్లమబ్బుల ఆకాశమవుతుంది.

* * * *

ఎక్కడో
శిలలు కరిగి ప్రవహిస్తాయి
గాయపడ్డ సముద్రాలు ఘోషిస్తాయి
దయాపుష్పాలు జలజలా రాలతాయి
కనబడని చేతులు దేహాన్ని నిమురుతాయి
వేల పావురాలు కువకువా వాలతాయి
ఎక్కడో రహస్యపు పొరల్లో
అద్భుత జీవ రసాయన సమ్మేళనం జరుగుతుంటుంది

* * * *

వేణువే అంత
అంతర్లోక సంచారం చేస్తుంది
అంతలోనే దుఃఖ జ్వరాన్ని చేసి పశ్చాత్తాపంతో
కుమిలిపోయే తనాన్ని చేసి పరవశ తరంగాన్ని చేసి
చివరికి సమస్తదేహాన్నీ
ఒకే ఒక్క ద్రవీభూత బిందువుగా మార్చుతుంది.
కోటి ప్రకంపనల మధుర పరికరాన్ని చేస్తుంది
సమస్త బంధాలు తెంచి నన్ను నా నుంచి విముక్తుణ్ణి చేస్తుంది
వేణువే అంత
ఆనందమై వేధిస్తుంది

* * * *

స్వరాల జడిలో తడిసినప్పుడల్లా
పచ్చని పచ్చికనై పోతాను
గుండె చెలమలోంచి జాలి ఊటనై పొర్లిపోతాను
ప్రపంచాన్ని ప్రేమించడం తప్ప మరేమీ చెయ్యలేని
బలహీనున్ని మహాశక్తిశాలినీ అవుతాను
అంతిమస్వరం ఒలికిపోయినచోట కాలం ఆగిపోయినచోట
శరీరమైదానం మీద
ఇంద్ర ధనస్సుపై మిగిలిపోతాను

(హరిప్రసాద్ చౌరసియా వెదురువేణువుకి)

—పాపినేని శివశంకర్




## ధనం వేలం...

సూర్యుడి చుట్టూ ఎన్ని చుట్లేసినా
భూమి భూమిగానే మిగుల్తుంది
అవసరాన్ని చుట్టూ తిప్పుకున్న ప్రతిసారీ
రూపాయి మాత్రం రెట్టింపవుతుంది
అవసరాన్ని ఆదిమత్వంతో చూడటమే "వడ్డీ"అయినా,
నోటుని, నోటుతో, నోట్లగా పిల్చగలగడమే
నేటి సమర్థత.
అర్థాంగి కావటానికీ - అర్థమే అర్హత!
కట్నం తెచ్చే వాళ్ళకై కనేముందే స్కావింగ్ వడపోత!
ఆస్థి మిగిల్చే వాళ్ళే నేటి ఆదర్శ మాతాపిత!
మూడు సింహాలు వేటాడని విషయం కోసం -
వెనక్కి - వెనక్కి - వెనక్కి -
వస్తు మార్పిడి వరకూ పోవాల్సిందే!
ఇప్పుడు -
మనుషులంతా, ఎక్కువ పొదిగిపెట్టే చోటుకోసం,
ఎప్పటికీ వెతుకుతూనే వుంటారు.
చెడ్డీల వయసు నుండే -
కిడ్డీ బ్యాంకులతో శిక్షణ
ప్రాథమిక హక్కులు తెలియకపోయినా పర్లేదు,
ప్రామిసరీ నోటు నేర్చుకోవాలి ముందు!
తలల్నిండా కట్టలు కట్టలుగా -
షేర్లూ - డిబెంచర్లూ,
డిపాజిట్లూ - డివిడెండ్లు
మూడు పువ్వులకు ఆరుకాయల ఆశల చెట్లు,
పొదుల్లో బిగ్‌బుల్ వేరు పురుగులు
రక్తపోటూ - ద్రవ్యోల్బణం
జతగానే పెరుగుతాయా?
స్విస్ బ్యాంక్ ఖాతాలే -
పరమావధి అవుతున్న చోట
చిరునవ్వుల దవడల నొక్కి,
కనీసావసరాలూ కంటి తుడుపుగా పూరించి,
ఆదాయ వ్యయాల సంచీలో,
ఆనందాలను అడుగున తొక్కేసి,
నందేళ్ళకు ఫిక్సెడ్ చేసినా -
జీవితమే చెల్లని నోటు!
అందుకే,
వడ్డీగా మరో జీవితం రాదు!

— పాటిబండ్ల రజని

ఆ ముద్దుని పట్టించుకోనట్టు "ఈ ఫోటోలేం చేస్తావ్?" అన్నాను.

"ఇవన్నీ నాకిచ్చెయ్. పోటీలకి పంపిస్తాను" అన్నాడు.

"సరే. తీసుకో."

"థ్యాంక్స్ చెప్పేపని లేదా" అన్నాడు.

"ఎందుకు? ఫోటోస్ తీసినందుకా! నేనేం అడగలేదుగా. నువ్వే తీశావ్. నువ్వే తీసుకొన్నావ్. ఇంకెందుకేమిటి థ్యాంక్స్. గట్టిగా మాట్లాడితే నువ్వే నాకు చెప్పాలి" అన్నాను.

"ఫోటోస్‌కి కాదు"

"మరి"

చూపుడు వేలితో బుగ్గపై సున్నా చుడుతూ చిటికేసి "ఇందుకు" అన్నాడు.

ఈ రొమాంటిక్ సురేష్ నాకు చాలా కొత్త. ఏం మాట్లాడాలో తెలియలేదు. అప్పటివరకు ఓ స్నేహితుడిగా నన్ను తీర్చిదిద్దే ఓ అన్నలా తోచే సురేష్ జీవనరాగ పదనిసలు యుగళగీతంలా చేయి చేయి కలిపి ఏడడుగులు వేద్దాం - రా. రమ్మని పిలుస్తున్న ప్రియతములా అనిపిస్తోంటే మౌనంగా అతనితో కలసి తోటలోంచి బయటకి వచ్చాను.

తర్వాత పరీక్షల హడావుడి. ఆ తర్వాత ఫలితాల విజయోత్సవం.

అక్కలిద్దరి పెళ్ళిళ్ళతో ఆర్థికంగా చితికిపోయిన నాన్న నా పెళ్ళికి ఎదిగిన ఆడపిల్ల అంటూ తొందరపడలేదు. 'ఈ రోజుల్లో అంతా చదువుకుంటున్నారు. నీ ఇష్టం వచ్చినంతవరకు చదువుకో. లేదా ఏదైనా ఉద్యోగం చేయి. ఆ డబ్బు బ్యాంక్‌లో వేస్తే కట్నంగా ఉపయోగపడొచ్చు' అంటూ సలహా ఇచ్చాడు.

'కట్నం ఇచ్చి పెళ్ళా' అంటూ మనసు దీర్ఘం తీసింది. సురేష్ గుర్తొచ్చాడు. ఆనాడు తోటలో ఆ మాటలు తప్ప తిరిగి ఏ రోజు మా ఇద్దరి నడుమ అటువంటి సంఘటనలేం జరగలేదు.

పై చదువులకని సురేష్ ఢిల్లీ వెళ్ళాడు. నే 'లా'లో జాయిన్ అయ్యాను. ఢిల్లీ వెళ్ళిన తొలి దినాల్లో ఉత్తరాలు రాసిన సురేష్ రానురాను రాయటం మానేశాడు.

అతని జ్ఞాపకాలు నేను అన్నివిధాల ఎదగడానికి అతనిచ్చిన ప్రోత్సాహం - ధైర్యం హృదయాన్ని హత్తుకొని వున్నాయి.

ఢిల్లీ నుంచి వచ్చినప్పుడు సురేష్ పుస్తకాలు-క్యాసెట్స్ తీసుకొచ్చి ఇచ్చేవాడు. ఢిల్లీ జీవన విధానాన్ని చెప్పేవాడు.

అటువంటి సురేష్ ఓసారి వచ్చి వారమైనా నన్ను కలవలేదు. నేనే అతన్ని పట్టుకొని "ఏంటి నా దగ్గరకి రాలేదేంటి" అడిగాను.

"సాయంత్రం గౌతమీ లైబ్రేరీ దగ్గరకి రా" అన్నాడు.

కొత్త కట్టడాలకి ఎదురుగా పురాతన నిత్యనూతన పొగడ చెట్టు కింద చప్టాపై కూర్చొని ఎదురుచూస్తుండగా సురేష్ వచ్చాడు.

"ఐయామ్ సారీ వందనా! మా మేనత్తగారమ్మాయి ప్రసూనతో పెళ్ళి నిశ్చయం అయింది. చిన్నప్పట్నుంచి నేనే తనకి కాబోయే భర్తనని నలుగురు అంటుండడంతో ప్రసూన నాపై ఆ రకమైన అభిమానాన్ని తనలో పెంచుకుంది. ఆ విషయం నాకీ మధ్యే తెలిసింది. నేనామెని చేసుకోననేసరికి చాలా అప్‌సెట్ అయి నిద్రమాత్రలు మింగేసింది. సమయానికి డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్ళారు. ఇప్పుడు బాగుంది. అంతా నన్నే దోషిగా చూస్తున్నారు. నాన్నగారు బాగా పట్టుపట్టి ఒప్పించారు. ఇన్నాళ్ళు నాకు నచ్చినట్టు జీవితం గడిపిన నేను అతిముఖ్య విషయంలో మరొకరి ఒత్తిడికి లొంగాల్సి వచ్చింది. ఐయామ్ సారీ వందనా! ఐ యామ్ సారీ" అసంతృప్తి, ఆవేదనా, నిస్సహాయత నిండిన స్వరంతో చెపుతోన్న సురేష్‌ని చూస్తుంటే నోట మాట రాలేదు.

అతన్ని ఎలా ఓదార్చాలో, ఎలా ధైర్యం చెప్పాలో అర్థం కాలేదు. నాలో బాధని ఎలా వ్యక్తపర్చాలో, అసలు చెప్పాలో, అక్కరలేదో తెలియక నిశ్శబ్దంగా వుండిపోయాను.

సురేష్ పెళ్ళి ప్రసూనతో అయింది. నా 'లా' పూర్తి అయింది. సురేష్ ఢిల్లీలోనే సెటిల్ అయ్యాడు. పెళ్ళి తర్వాత నన్ను అతను అస్సలు కలవలేదు. పెళ్ళి చేసుకోకపోతే పోయాం. స్నేహితులుగానైనా ఎందుకుండలేకపోయాం అనుకునేదాన్ని.

మొదటిసారి కోర్టులో అనర్గళంగా - స్పష్టంగా - నిర్భయంగా నేను వాదించిన రోజు సురేష్ ఎంతలా గుర్తొచ్చాడో. ఆనందంతో - కృతజ్ఞతతో చెమ్మగిల్లిన నయనాలకి తెలుసు.

'సురేష్! నే వాదించాను. నువ్వానాడు నా కిచ్చిన స్ఫూర్తితో - నేనీనాడు వాదించాను' - హృదయ ప్రాంగణంలో ఎన్నెన్ని ప్రణామ పుష్పాలో...

ఇదిగో మళ్ళీ ఇక్కడ ఇలా సురేష్‌కి సంబంధించిన వార్త.

ఫ్యాన్ తిరగటం మొదలుపెట్టింది.

'పవర్ వచ్చిందా' అనుకొంటుండగా కాలింగ్ బెల్ మోగింది.

తలుపు తీసాను. రవ్వంత కష్టం లేకుండా గుర్తించాను.

సురేష్!

"రా.రా. భలే వచ్చావ్. నీ ఫోటో పేపర్లో చూశాను. ఎందుకేశారో ఏమిటో ఇంకా చదవలేదు. ఎప్పుడొచ్చావ్?" ఆశ్చర్యానందాలతో అడిగాను.

"నీదేగా అది. ఆ ఫోటోకి నేషనల్ అవార్డు వచ్చింది. హైదరాబాద్ ఎప్పుడొచ్చావ్? రాజమండ్రి వెళ్ళినప్పుడు నీ అడ్రస్ అడిగితే మీ ఇంట్లోవాళ్ళు ఇచ్చారు. సాయంత్రం యూనివర్సిటీ సైన్ ఆర్ట్స్‌వాళ్ళు సన్మానం చేస్తున్నారు. నువ్వు కూడా రావాలి" అన్నాడు సురేష్.

"సాయంత్రమా? క్లయింట్స్ వస్తారే" అన్నాను.

"ఎలా వుందోయ్ నీ ప్రాక్టీస్"

"గట్టిగా వాదిస్తున్నానోయ్"

"నే చాలా భయపడ్డాను వందనా. నా వలన నువ్వు అప్‌సెట్ అయి చదువు పాడుచేసుకుంటావేమోనని" అన్నాడు.

"ప్రసూన ఎలా వున్నారు? పిల్లలా? నీ విషయాలు చెప్పు. కాఫీ – టీ ఏం తీసుకుంటావ్?" అడిగాను.

అతను కాసేపు మౌనంగా వుండి "గతంలో నిన్ను చేసుకోలేకపోయాను. పెళ్ళయి ఇద్దరు పిల్లలు వున్నారనే విషయంలో నీకే అభ్యంతరం లేకపోతే మనిద్దరం పెళ్ళి చేసుకోవాలని నాకుంది. ఏమంటావ్" నిదానంగా అడిగాడు.

ఇది నే ఊహించని ఆహ్వానం. పెళ్ళి–పిల్లలు కంటే అతనికి నేనంటే అభిమానం నిండుగా వుండటం ముఖ్యంగా.

"మీ ఇంట్లో అభ్యంతరం వుండదా" అడిగాను.

"నేనింకా ఎవ్వరికి ఈ విషయం చెప్పలేదు. ముందు నీ కిష్టమో లేదో తెలిస్తే మిగిలిన విషయాలు. నీ కిష్టమైతే చాలు. మరొకరి ఇష్టాయిష్టాలతో నాకేం పనిలేదు" అన్నాడు సురేష్.

సురేష్‌ని తిరస్కరించాలనిపించలేదు. నేను జవాబు చెప్పక ముందే "నా కిద్దరు పిల్లలు. మరో బిడ్డ ప్రసక్తి లేదు" స్పష్టంగా చెప్పాడు సురేష్.

అతను పిల్లలు వద్దనుకుంటున్నాడో లేక పిల్లలు పుట్టే అవకాశం లేకుండా ఆపరేషన్ చేయించుకున్నాడో అర్థం కాలేదు.

అదే అడిగాను.

"పిల్లలొద్దు"

"ఎందుకని?"

"ఇద్దరున్నారుగా"

"ఉంటే?"

"చాలరా"

"మరొకరుంటే ఏమవుతుంది?"

అతను జవాబు చెప్పలేదు.

"పెంచటం కష్టమా" అడిగాను.

"కాదు. తల్లి లేని ఆ పిల్లలని ప్రేమగా చూసే స్త్రీ కావాలి. సొంత పిల్లలుంటే అది కష్టం."

"నేనో బిడ్డని కంటె ఈ పిల్లల్ని ప్రేమగా చూడనని అంత కచ్చితంగా ఎలా అంటున్నావ్?"

"సొంత పిల్లలపై ప్రేమ సహజం కదా" తపీమని చెప్పాడు.

"నా పిల్లలు నీ పిల్లలు అనే తేడా లేకుండా పెంచుతాను. అప్పుడు అభ్యంతరం వుండదుగా"

"వద్దు. స్పర్ధలు వస్తాయి" స్పష్టంగా అన్నాడు.

"నమ్మకం లేదా" ఆశ్చర్యం వేసింది నాకు.

"ఆ" చప్పున అన్నాడు.

"నీ భార్యగా, నీ పిల్లలకి తల్లిగా నీ యింటికి రమ్మని నన్నాహ్వానిస్తున్నావ్. నేనో బిడ్డని కంటె వాళ్ళిద్దర్నీ బాగా చూడలేనని గట్టిగా నమ్ముతున్నావ్ కదా! నే కన్న పిల్లలు కారు కాబట్టి బాగా చూడననే నమ్మకం నీకు లేనట్టే నే కన్న పిల్లలు కారు కాబట్టి వాళ్ళకి నాపై ప్రేమ వుంటుందని నేనెలా నమ్మాలి. నాకు తోడుగా మీరంతా ఎప్పుడూ వుంటారని నేనెలా ఆశపడాలి. నీకు నాపై లేని నమ్మకం, నాకు మాత్రం నీ పట్ల, పిల్లల పట్ల ఎలా వస్తుంది" ఏ మాత్రం ఆవేశపడకుండా స్పష్టంగా, నిర్భయంగా, శాంతంగా అడిగాను.

సురేష్ కళ్ళల్లో కలవరం.

"పిల్లలు వద్దన్నారనే అసంతృప్తితో ఈ పిల్లల్ని బాగా చూస్తాననే నమ్మకం ఏముంది? నీ పిల్లలు నా పిల్లలు ఏంటి? ఇద్దరు చాలు. ఇంకెవరూ వద్దనే నిర్ణయం నాకు రావాలి. అంతేకాని పిల్లలు నే కనాలో వద్దో కూడా నువ్వు నిర్ణయించేస్తావా? పెళ్ళి లేకపోతే వచ్చే నష్టం ఏం లేదుకాని ఇలా ముందే పిల్లలు కనాలి, వద్దులాంటి ఒప్పందాలతో నీ జీవితంలోకి రాలేను" స్పష్టంగా చెప్పాను.

సురేష్ కాసేపు ఆలోచిస్తున్నట్టుండిపోయాడు.

"మరోలా అనుకోకు వందనా. పిల్లలపై ఇష్టం నన్నలా మాట్లాడించింది. ముందే అన్ని విషయాలు స్పష్టంగా మాట్లాడుకోవాలిగా. కాస్త నిదానంగా ఆలోచించు" అన్నాడు.

"వద్దు సురేష్. వద్దు. ఆలోచించటానికేం లేదు. మాతృత్వం స్త్రీకి వరమో–శాపమో తెలియదుకాని జీవితంలో చాలామందికి చాలాసార్లు దుఃఖానికే కారణమవుతోంది. పిల్లలు పుట్టలేదని విడాకులు ఇచ్చేవాడొకడూ – లేదా ఆవిడ ఆత్మహత్య చేసుకునేదాకా సతాయించేవాడొకడూ – అదీ ఇదీ కాకపోతే చంపేవాడొకడు, తాగొచ్చి తన్నే భర్తని వదిలిపోదామంటే పిల్లల్ని ఇవ్వనని బెదిరించేవాడొకడూ – పిల్లల్ని కనటానికి, పెంచడానికి తన సర్వశక్తులు పణంగా పెట్టే ఆడవాళ్ళకి పిల్లల్ని కనాలో వద్దో నిర్ణయించుకునే స్వేచ్ఛ మాత్రం లేదు. రోజూ ఇలాంటి విషయాలు విని, చూసి మగవాళ్ళెందుకింత కఠినంగా వుంటారో అనుకునేదాన్ని. ఓ మంచి స్నేహితునిగా వున్న నువ్వూ వాళ్ళందరిలానే ఆలోచిస్తున్నావ్. స్త్రీపురుష సాంగత్యంలో అవగాహనున్న తోడు నాక్కావాలి తప్ప, నీలా ఆలోచించేవాళ్ళు నాకక్కరలేదు" – స్పష్టంగా చెప్పాను.

సురేష్ కళ్ళలో నాకే భావాలు కనిపించలేదు. ఉదయం కాఫీ తాగి వస్తానంటూ వెళ్ళిపోయాడు.

నెల రోజుల తర్వాత సురేష్ నుంచి శుభలేఖ వచ్చింది.

పెళ్ళి ఎక్కడైనా – పెళ్ళి కూతురెవరైనా పురుష నిరంకుశత్వపు వలలో చిక్కుకున్న మరో మాతృత్వమే కదా ఆ జీవితం....



## ఛాయాచిత్రం

ఒకానొక మనసు ప్రవహించిన రాత్రి
ఆవిష్కరించిన దీర్ఘకాలిక కానుక
నా బిడ్డ
ఆరోజు–
నా బాధలన్నీ
రేకులు రేకులుగా విడిపోయాయి
ఆరిన కన్నీటి చారికల్ని
వెన్నెల కప్పేసింది
లేలేత చేతులు నా గుండెమీద
రసాత్మక రాగాలాపన చేసాయి
శృంఖలాలు తెగిన ప్రేమస్వప్నాన్ని
నేను కౌగలించుకున్నాను.

కొత్త సూర్యోదయం
ప్రతిరోజూ కొత్తగా తెలవారాల్సిందే
అత్యంత నవీన ప్రభాతగీతం
ఋతువులు వచ్చిపోతున్న అలికిడి
ఒక్కో స్వప్నమే
విచ్చుకుంటున్న అనుభూతి
రోజూ ఆశ్చర్యమే ...
నా పోలికల్తో – నా సౌందర్యంతో
నా ప్రాణంతో ఒక అమరిక
నా రక్తం ప్రవహించే శరీరంలో
నా 'ఇగో'తో పాటు
కవిత్వం కూడా ప్రవహిస్తుందన్న నమ్మకం.

– మహెజబీన్